క్లుప్తంగా

శ్రీవారికి విశేష అర్చనలు



ప్రత్యేక అలంకరణలో స్వామి

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని కీతిన్‌పేట వద్దనున్న ఐశ్వర్య వెంకటేశ్వర స్వామి ఆలయ సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు పురాణం శేషాచార్యులు ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. 12రకాల ప్రసాదాలను స్వామివారికి నివేదించి, ఊంజల్ సేవ చేశారు. ఆలయ ట్రస్టీలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు



ముత్యాలమ్మ ఆలయం వద్దకు కలశాలతో నీరు తీసుకువెళ్తున్న మహిళలు

పద్మనాభం: పద్మనాభం గ్రామస్తులు ముత్యాలమ్మ వారికి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ గ్రామంలో వచ్చే నెల రెండు నుంచి నాలుగో తేదీ వరకు బంగారమ్మ ఉత్సవాలు జరుగుతాయి. గతంలో 2019 జూన్‌లో ఈ ఉత్సవాలు నిర్వహించారు. మళ్లీ ఇప్పుడు ఆరేళ్లకు ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా మహిళలు పద్మనాభం గ్రామం నుంచి కలశాలతో పద్మనాభం జంక్షన్‌లో ఉన్న ముత్యాలమ్మ ఆలయం వద్దకు అభిషేక జలం తీసుకువెళ్లారు. అనంతరం అమ్మవారికి పసుపు, కుంకుమలు చెల్లించి పూజలు చేశారు. అధిక సంఖ్యలో తరలి వచ్చిన గ్రామస్తులతో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు తాలాడ పద్మనాభం, కంటుబోతు ఎర్నాయుడు, ఎన్నింటి నరిసింగరావు అమ్మవారి సన్నిధిలో పూజలు చేశారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు బంగారురెడ్డి మృతి



వెంపాడ బంగారురెడ్డి (ఫైల్)

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ పంచాయతీ సిటీనగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంపాడ బంగారురెడ్డి (53) గుండెపోటుతో బుధవారం రాత్రి మరణించారు. రాత్రి 11 గంటల సమయంలో గుండెలో నొప్పి రాగా, ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. బంగారురెడ్డి గతంలో పంచాయతీ వార్డు సభ్యునిగా విధులు నిర్వర్తించారు. గురువారం సిటీనగర్ స్మశానవాటికలో బంధువులు అంత్యక్రియలు నిర్వహించారు. చిప్పాడ, పెదనాగమయ్యపాలెం పంచాయతీల నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు వచ్చి బంగారురెడ్డికి నివాళులు అర్పించారు.

అపారిశుధ్యంపై జెడ్సీ ఆగ్రహం



శ్రీకాంత్‌నగర్ రోడ్డులో నిల్వ ఉన్న చెత్త పరిశీలిస్తున్న జెడ్సీ కనకమహాలక్ష్మి

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డులో జోన్–2 జెడ్సీ కనకమహాలక్ష్మి గురువారం సందర్శించారు. వార్డు పరిధి లీలాసుందరినగర్, రాజీవ్ నగర్, శ్రీకాంత్‌నగర్‌ను ఆనుకొని కనకమహాలక్ష్మి కేటరింగ్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఆమె పర్యటించారు. రోడ్లు, కాలువలను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకొన్నారు. రోడ్డు పక్కన చెత్త నిల్వలు ఉండడం, కాలువల్లో చెత్త పేరుకుపోవడం, కనకమహాలక్ష్మి కేటరింగ్ పరిసరాలలో రోడ్లు పాడవడం, చెత్తతో రోడ్డు అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించిన జెడ్సీ పారిశుధ్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అక్కడ చెత్త నిల్వలను పారిశుధ్య సిబ్బందిచే తొలగించారు. కేటరింగ్ నిర్వాహకులకు రూ.5,000 జరిమానా విధించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. ఇలాంటి పరిస్థితి పునరావృతమైతే చర్యలు తప్పవని కేటరింగ్ నిర్వాహకులకు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, సచివాలయం సిబ్బందిని ఆమె హెచ్చరించారు. ఈ పర్యటనలో జోన్–2 ఏహెచ్‌ఎంవో డాక్టర్ కిశోర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అందాల తీరం.. అభివృద్ధికి దూరం



జెట్టీ దిగువ భాగం

ప్రకృతి అందాలతో అలరారుతున్న భీమిలి మండల తీరప్రాంతాలు
ఆసక్తితో వెళ్తున్న పర్యాటకులు
వసతులు లేక నిరాశతో వెనక్కి..

చారిత్రక, ఐతిహాసిక ప్రాధాన్యంతో పాటు ప్రకృతి సౌందర్యంతో అలరారే ప్రాంతం భీమిలి. మండల పరిధిలోని అన్నవరం పంచాయతీలో ఎర్రయ్యపాలెం వద్ద జెట్టీ, పాండవుల పంచ, పెదనాగమయ్య పాలెం పంచాయతీ పరిధి ఇసుక దిబ్బలు, సరుగుడు తోటలు పర్యాటకులను కట్టిపడేస్తాయి. అయితే సరైన రవాణా సౌకర్యం లేకపోవడం, వసతుల లేమితో అందాల తీరప్రాంతాలు సందర్శకులకు అందనంత దూరంలోనే ఉండిపోతున్నాయి.



ఎర్రయ్యపాలెం తీరంలో పర్యాటకులను ఆకర్షిస్తున్న జెట్టీ



పాండవుల పంచలో ఆకర్షణీయమైన ప్రాంతం

తగరపువలస: భీమిలి మండలం అన్నవరం, పెదనాగమయ్యపాలెం తీరంలో ప్రకృతి అందాలు పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. తీరా ఇక్కడకు వచ్చి చూస్తే వసతులు లేకపోవడంతో అంతలోనే నిరాశతో వెనుదిరుగుతున్నారు. ముఖ్యంగా అన్నవరం పంచాయతీలోని ఎర్రయ్యపాలెం వద్ద జెట్టీ, అక్కడికి చేరువలోనే ఉన్న పాండవుల పంచ ప్రసిద్ధి చెందాయి. పెదనాగమయ్యపాలెం పంచాయతీలోని ఇసుక దిబ్బలు, జీడి, తాటి, సరుగుడు తోటలు కనువిందు చేస్తాయి. ఈ ప్రాంతంలో పర్యటించేవారు వీటిని చూస్తూ మైమరచిపోతుంటారు. కానీ ఈ రెండు ప్రాంతాలకు సరైన రవాణా సదుపాయాలు కూడా లేవు. తాగునీరు అందుబాటులో లేదు, కొనుక్కుందామన్నా దొరకదు. సేద తీరడానికి బెంచీలు, మూత్ర విసర్జనకు వాష్‌రూమ్‌ల సౌకర్యాలు లేవు. చీకటి పడితే బీచ్ అందాలు తిలకించడానికి విద్యుద్దీపాలు అసలే లేవు. భీమిలి టౌన్, విశాఖ బీచ్‌లతో పోలిస్తే ఈ గ్రామీణ ప్రాంతంలో వసతులు పూర్తిగా శూన్యం. ఎండకు ఎండుతూ, వర్షానికి తడుస్తూ అవసరమైతే చెట్ల కిందే తల దాచుకుంటూ ఇక్కడికి వచ్చే పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం పంచాయతీ తరఫున అయినా ఈ రెండు పంచాయతీలలో నామమాత్రపు రుసుముతో వసతులు కల్పించాలని పర్యాటకులు కోరుతున్నారు. అలాగే ఒంటరిగా వచ్చేవారిపై ఈ ప్రాంతంలో ఆకతాయిలు దాడులు చేస్తున్న పరిస్థితులు కూడా అప్పుడప్పుడు కనిపిస్తున్నాయి.

వసతులు కల్పిస్తే పర్యాటకుల క్యూ

భీమిలి టౌన్, విశాఖ మాదిరిగా ఈ గ్రామీణ బీచ్ ప్రాంతాలలో వసతులు, భద్రత కల్పిస్తే పర్యాటకులు క్యూ కడతారు. ఇప్పటి వరకు వెండితెరపై మాత్రమే చూసిన జెట్టీని ప్రత్యక్షంగా చూసి అపురూపమైన అనుభూతికి లోనవుతారు. వసతులు సంగతి ఎలా ఉన్నా కార్తీకమాసంలో మాత్రం సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు కూడా ఎర్రయ్యపాలేన్ని ఇష్టపడతారు.



ఎర్రయ్యపాలెం తీర ప్రాంతంలో డెబ్రిస్ పోగులు



అటవీశాఖ ఆధ్వర్యంలో తీరంలో సరుగుడు తోట

చారిత్రక, ఐతిహాసిక ప్రాశస్త్యం

- ఎర్రయ్యపాలెం తీరప్రాంతం చారిత్రాత్మక, ఇతిహాసాలతో ముడిపడి ఉన్న ప్రదేశం.
- స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో జరిగిన ఉప్పు సత్యాగ్రహంలో గాంధీజీ దేశవ్యాప్తంగా తీర ప్రాంతాల్లో ఉప్పు సాగు చేసే ప్రాంతాలలో పర్యటించారు. అప్పట్లో ఆయన 200 మంది అనుచరులతో ఎర్రయ్యపాలెం వచ్చి మత్స్యకారులతో ముచ్చటించారు. దీనికి గుర్తుగా మత్స్యకారులు సంక్రాంతికి ఈ తీరంలో జెండా ఎగరవేస్తారు. ఆయన గురువారం ఈ ప్రాంతానికి వచ్చినందున భీమిలి తీరంలోని ఏ మత్స్యకారుడు ఆ రోజు వేటకు వెళ్లరు.
- ఎర్రయ్యపాలెం నుంచి బీచ్‌లో ఉత్తర దిశగా మూడు కిలోమీటర్లు నడిచి వెళ్తే పాండవుల పంచగా పిలుచుకునే ప్రదేశం పర్యాటకులను ఆకట్టుకుంటుంది. ఇక్కడి కొండలు సముద్రపు అలలు, గాలులకు శైథిల్యం చెంది వివిధ ఆకృతులు ఇప్పటికీ కనిపిస్తాయి. పాండవులు 12 ఏళ్ల అరణ్యవాసం అనంతరం ఏడాది పాటు అజ్ఞాతవాస సమయంలో ఈ ప్రదేశంలో విడిది చేసినందున దీనిని పాండవుల పంచ అని పిలుస్తారు. ఓపికగా ఈ ప్రాంతానికి నడుచుకుని వెళ్తే పర్యాటకులు అక్కడ ప్రకృతి చెక్కిన అందాలను చూసి ముగ్ధులవుతారు.

బస్సు సౌకర్యం కల్పించాలి



గతంలో అన్నవరం, పెదగనాగమయ్యపాలెం వెళ్లడానికి విశాఖ నుంచి సిటీ బస్సులు ఉండేవి. ఇప్పుడు కేవలం ఆటోలు మాత్రమే కట్టించుకుని రావాలి. పర్యాటకులను కట్టిపడేసే అందాలు ఇక్కడ ఉన్నా రవాణా సదుపాయం లేక ఈ ప్రాంతాలకు అంతగా గుర్తింపు రాలేదు. పర్యాటకులు సినిమాలు, యూట్యూబ్‌లలో చూసి మురిసిపోవలసి వస్తోందంతే..
– దువ్వి రాజు, తగరపువలస

సేద తీరే ప్రాంతమేది?



భీమిలి గ్రామీణ ప్రాంత అందాలు స్నేహితుల ద్వారా విని ఇక్కడకు ఎలాగో కష్టపడి వచ్చాను. కానీ ఇక్కడ ఉండటానికి కనీస వసతులు లేవు. ఎండలో ఇసుక తిన్నెలపై కూర్చోవాలి.. లేదంటే సరుగుడు, తాటిచెట్ల నీడలో ఉండాలి. తాగునీరు, వాష్‌రూమ్‌లు లేకపోవడంతో వెంటనే వెళ్లిపోవలసి ఉంటుంది. ప్రభుత్వం ఈ బీచ్‌ను అభివృద్ధి చేయాలి. – కాసా శేఖర్, గాజువాక

నిరాశతో వెనక్కి..



బయట ప్రాంతాలకు చెందిన మా స్నేహితులు ఇక్కడి అందాల గురించి విని చూడాలని తహతహలాడుతుంటారు. తీరా ఇక్కడికి వచ్చాక ఎలాంటి సదుపాయాలు లేక నిరాశతో వెనక్కు తిరిగి వెళ్లిపోతున్నారు. ఈ తీరంలో టోల్‌గేట్ లాంటివి ఏర్పాటు చేసి పార్కును అభివృద్ధి చేసి పర్యాటకులను ఆకట్టుకోవాలి. నామమాత్రపు రుసుముతో సౌకర్యాలు కల్పించాలి. అప్పుడే భీమిలి మరింత ప్రాచుర్యంలోకి వచ్చి అభివృద్ధికి చేరువ అవుతుంది. –జోసెఫ్ జేమ్స్, చిట్టివలస

అభివృద్ధి పథంలో వీసీబీ మధురవాడ బ్రాంచ్



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ మూర్తి

మధురవాడ: విశాఖ కో–ఆపరేటివ్ బ్యాంకు మధురవాడ బ్రాంచ్ గత ఆర్థిక సంవత్సరం కంటే అభివృద్ధి పథంలో నడుస్తోందని సంస్థ ఇన్‌చార్జి డైరెక్టర్ జీవీ సత్యనారాయణ మూర్తి తెలిపారు. మధురవాడ మిధిలాపురి వుడా కాలనీలోని ఓ ఫంక్షన్ హాల్లో బుధవారం నిర్వహించిన బ్రాంచ్ మహాజన సభలో ఆయన మాట్లాడారు. 1842మంది సభ్యులతో రూ.11.36 కోట్ల షేర్ ధనం, రూ.134.35 కోట్ల డిపాజిట్లు కలిగి, రూ. 59.56కోట్ల రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. బ్రాంచ్ పనితీరు మెరుగు పరచుకోవడానికి అంతా సమైక్యంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఎస్.నాగభూషణ చౌదరి, చంద్రశేఖర్, ఈడీ జీవీ రామకృష్ణ, సీఈవో వీవీ వరలక్ష్మి, డిప్యూటీ సీఈవో ఎం.గణేష్, జోనల్ మేనేజర్ ఎం.సత్యనారాయణ, మేనేజర్ అప్పా రావు తదితరులు పాల్గొన్నారు.

30 మందికి పౌర సన్మానం



వైద్యురాలు సత్య చైతన్యను సన్మానిస్తున్న ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు

పద్మనాభం: మండలంలోని రెడ్డిపల్లిలో బంగారమ్మ ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి 30 మందికి ఎంప్లాయిస్ అసోసియేషన్ తరఫున పౌర సన్మానం చేశారు. వీరిలో 11 మంది రిటైర్డ్ ఉద్యోగులతో పాటు 2019లో బంగారమ్మ పండగ నిర్వహించిన తరవాత నుంచి ఇప్పటి వరకు ఎంబీబీఎస్, ఐఐటీ, ఎన్ఐటీల్లో సీట్లు వచ్చిన వారు ఉన్నారు. వారిని శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో రెడ్డిపల్లి ఉప సర్పంచ్ సిరుగుడి ఆదినారాయణ, ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సర్ ఆర్థర్ కాటన్ సేవలు అమూల్యం

కొమ్మాది: భారతదేశానికి, ముఖ్యంగా రాష్ట్ర నీటి పారుదల రంగంలో సర్ ఆర్థర్ కాటన్ సేవలు అమూల్యమైనవని గీతం ప్రో వీసీ వై.గౌతమ్‌రావు అన్నారు. ప్రముఖ ఇంజనీరింగ్ నిపుణుడు, గోదావరి ఆనకట్ట రూపశిల్పి సర్ ఆర్థర్ కాటన్ 222వ జయంతిని గీతంలో గురువారం నిర్వహించారు. కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

జోన్ల పునర్వ్యవస్థీకరణపై అభిప్రాయ సేకరణ



కార్పొరేటర్లు, ఇతరులతో మాట్లాడుతున్న జెడ్సీ కనకమహాలక్ష్మి

మధురవాడ: అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా జోనల్ కార్యాలయాల పరిధి పునర్వ్యవస్థీకరణపై మధురవాడ జోనల్ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. జెడ్సీ కనక మహాలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో విశాఖ తూర్పు నియోజకవర్గ పరిధిలోని 9,10,11,12,13 వార్డుల ప్రజా ప్రతినిధులు, నివాస సంఘాల నాయకుల సూచనలు, సలహాలు స్వీకరించారు. వారు మాట్లాడుతూ ఆరిలోవ పరిసర ప్రాంతాలలో ఉన్న వార్డులకు జోనల్ కార్యాలయం చాలా దూరంగా ఉండడంతో అత్యధికులు మధురవాడ రావడానికి ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఆరిలోవలోనే జోనల్ ఆఫీసు ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై జెడ్సీ మాట్లాడుతూ అభిప్రాయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు. కార్యక్రమంలో ఏసీపీ తిరుపతిరావు, ఈఈ శాంతిరాజు కార్పొరేటర్లు స్వాతి, రామలక్ష్మి, సునీత, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కాలనీ ప్రవేశమార్గం రాళ్లమయం



జాతీయరహదారి నుంచి కాలనీలోకి ప్రవేశించే మార్గం ఇలా..

తగరపువలస: జీవీఎంసీ రెండోవార్డు సంగివలస అల్లూరి సీతారామరాజు కాలనీ ముఖద్వారం వద్ద స్థానికులకు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఇరువైపుల నుంచి కాలనీలోకి వెళ్లి రావడానికి మార్గాలు ఉన్నాయి. కాలనీలో రోడ్లు ఎలా ఉన్నా అక్కడ నుంచి సర్వీస్‌రోడ్డుపైకి రావడానికి, జాతీయరహదారి నుంచి కాలనీలోకి వెళ్లడానికి మాత్రం స్థానికులు నిత్యం ఇబ్బంది పడుతూనే ఉన్నారు. ముఖ్యద్వారంలో రాళ్ల దిబ్బ మాదిరిగా ఎత్తుగా ఉండటంతో ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ ప్రాంతంలో ఎత్తయిన ప్రదేశాన్ని చదును చేయించి, రాకపోకలకు వీలు కల్పించాలని కాలనీవాసులు కోరుతున్నారు. అలాగే కాలనీ వెనుక నుంచి రాకపోకలు సాగించేవారికి సైతం ఇబ్బంది లేకుండా చూడాలని కోరుతున్నారు.

సీబీఎస్ఈ టెన్త్ ఫలితాల్లో 'సెయింట్ ఆన్స్' ప్రతిభ



కె.తేజేశ్వరి (97.2%) | శ్రీఅనుపమ (96.8%) | స్వాతి అక్షయ (95.6%)

మధురవాడ: సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో మధురవాడ బక్కన్నపాలెంలోని సెయింట్ ఆన్స్ స్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారని కరస్పాండెంట్ సిస్టర్ జెసిల్లా, ప్రిన్సిపాల్ సిస్టర్ మగ్దలీన తెలిపారు. కె.తేజేశ్వరి 97.2 శాతం, కె.శ్రీఅనుపమ 96.8 శాతం, బి.స్వాతిఅక్షయ 95.6 శాతం, ఎస్.కార్తికేశ్వరి 95.4 శాతం, బి.జశ్వంత్‌రెడ్డి 95.4 శాతం మార్కులు సాధించారు. పరీక్షకు హాజరైన వారిలో 90–100 శాతం 20మంది, 80–89 శాతం 28మంది, 60–79 శాతం 31మంది, 60శాతం కంటే తక్కువ మార్కులు ముగ్గురు విద్యార్థులు సాధించారన్నారు. విజేతలను వారితో పాటు ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

కార్మికుల చట్టాల రక్షణకే 20న సమ్మె



కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న వెంకటరెడ్డి

మధురవాడ: ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలు, ప్రజల హక్కుల పరిరక్షణ కోసమే ఈ నెల 20న దేశవ్యాప్తంగా అఖిల పక్ష కార్మిక, ఉద్యోగ సంఘాలు, ఫెడరేషన్లు సమ్మె నిర్వహిస్తున్నాయని ఏపీ మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు వెంకటరెడ్డి తెలిపారు. మధురవాడ ద్రోణంరాజు కల్యాణ మండపం ఆవరణలో నిర్వహించిన మున్సిపల్, ప్రజారోగ్య విభాగాల కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమ్మెలో అన్ని వర్గాల కార్మికులు, ఉద్యోగులు, ప్రజలు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి ఎంవీ ప్రసాద్, నాయకుడు డి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

సద్గురు సేవాశ్రమం వార్షిక వేడుకలు ప్రారంభం



సాయినాథుడికి అభిషేకం చేస్తున్న దృశ్యం

తగరపువలస: జీవీఎంసీ 4వ వార్డు రామయోగి అగ్రహారంలోని సద్గురు సేవాశ్రమం 15వ వార్షిక వేడుకలు గురువారం ప్రారంభం అయ్యాయి. ఐదు రోజుల పాటు జరగనున్న ఈ వేడుకలు ఈ నెల 18న మహా అన్నదానంతో ముగియనున్నాయి. మొదటి రోజు కార్యక్రమంలో భాగంగా ఉదయం షిర్డీ సాయిబాబాకు 108 కలశాలతో జలాధివాసం, సాయంత్రం సుదర్శన హోమం, భజన కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం సాయినామ పఠనం, శ్రీ వేంకటేశ్వర స్వామి గానామృతం నిర్వహించనున్నారు. శనివారం భక్తి సంగీతలహరి, శ్రీహనుమాన్ సేవా భజన, చివరి రోజైన ఆదివారం అన్నదానంతో పాటు వస్త్రదానం, భక్తిగాన సుధ నిర్వహించనున్నారు.

15 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు



2010 నుంచి సద్గురు సేవాశ్రమం నుంచి ఉచితంగా వృద్ధాశ్రమం, గోశాల నిర్వహిస్తున్నాం. ఆలయాల నిర్మాణం చేపట్టాం. 2017 నుంచి మన్యంతో పాటు ఒడిశా ప్రాంతంలో 900 ఆలయాలు, విగ్రహాలు ఏర్పాటు చేశాం. మరో 100 విగ్రహాలు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. వీటితో పాటు వైద్య శిబిరాలు, తాగునీరు, యోగా వంటి కార్యక్రమాలు సేవాశ్రమం తరఫున చేపడుతున్నాం. – యోగా రాజు, నిర్వాహకుడు

మాస్టర్‌ప్లాన్ రోడ్డు విస్తరణ పనుల్లో కదలిక



రేవళ్లపాలెం మాస్టర్ ప్లాన్ రోడ్డులో మార్కింగ్ పనులను పరిశీలిస్తున్న డీసీపీ హరిదాసు

మధురవాడ: మధురవాడలో మాస్టర్ ప్లాన్ రోడ్డు విస్తరణ పనులు సత్వరమే పూర్తి చేసేందుకు తక్షణ చర్యలు చేపడుతున్నట్లు జీవీఎంసీ డిప్యూటీ సిటీ ప్లానర్ హరిదాసు తెలిపారు. నత్తనడకన సాగుతున్న ఆరో వార్డు రేవళ్లపాలెం మాస్టర్ ప్లాన్ రోడ్డు విస్తరణ పనుల్లో ఎట్టకేలకు కదలిక వచ్చింది. ఈ మేరకు హైవేను ఆనుకుని ఉన్న నివాసాలు, దుకాణాల ముందు చేపట్టవలసిన కాల్వల నిర్మాణ పనులను డీసీపీ గురువారం పరిశీలించారు. ఇక్కడున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు పోతిన హనుమంతురావు కుటుంబ సభ్యుల గ్రూపు హౌస్ వద్ద కాల్వ నిర్మాణం, ఇతర పనుల గురించి వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. విస్తరణ పనుల పేరుతో తమ ప్రహరీని ఏడాది క్రితమే కూల్చేశారని, కనీసం టాయిలెట్స్ కూడా ఉంచనివ్వలేదని వారు తెలిపారు. ఇంటి పరిసరాలలో రోడ్డు పనులు సగం చేసి వదిలేయడంతో ఇబ్బంది పడుతున్నామని, వెంటనే పనులు పూర్తి చేయాలని కోరారు. తాము రోడ్డు పనులకు అడ్డు తగులుతున్నామని కావాలనే కొంతమంది దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. తాము అభివృద్ధికి వ్యతిరేకం కాదని, అభివృద్ధి పనులకు అన్ని విధాలా సహకరిస్తామని హనుమంతురావు చెప్పారు. డీసీపీ హరిదాసు మాట్లాడుతూ పనులు తక్షణమే ప్రారంభిస్తామని, నివాసానికి ఇబ్బంది లేకుండా కాల్వల నిర్మాణం చేస్తామని తెలిపారు. పనుల నిర్వహణ, ఇతర అంశాలపై అధికారులు, సిబ్బందికి సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో టీపీవో బాలరాజు, వుడా ఏఈ శర్మ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి కేసు నమోదు

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని మామిడిపాలెం వద్ద గురువారం సాయంత్రం జరిగిన గొడవలో ఒక వ్యక్తిపై దాడి జరిగింది. ఇక్కడ ఉంటున్న బోని నర్సింగరావు అనే వ్యక్తిని మామిడి సురేష్, మామిడి అప్పలరాజు, మరో వ్యక్తి మనస్పర్థల కారణంగా తీవ్రంగా కొట్టి గాయపరిచారు. దీనిపై ఫిర్యాదు అందగా నిందితుల్లో మామిడి సురేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన ఇద్దరు పరారీలో ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అపార్ట్‌మెంట్లలో దాహం కేకలు



చిట్టివలసలో అపార్ట్‌మెంట్లు

తగరపువలస: జీవీఎంసీ పరిధిలోని పలు అపార్ట్‌మెంట్ వాసులు దాహం కేకలు వేస్తున్నారు. వేసవిలో భూగర్భజలాలు అడుగంటిపోవడంతో పదుల సంఖ్యలో ఫ్లాట్లలో నివసిస్తున్నవారికి అక్కడి బోర్ల నుంచి నీరు సరిపోవడం లేదు. జీవీఎంసీ కుళాయిల ద్వారా అరకొరగా అపార్ట్‌మెంట్లకు సరఫరా చేస్తున్న నీరు తాగునీటి అవసరాలకే చాలడం లేదు. దీంతో మిగిలిన అవసరాల కోసం ట్యాంకర్లను ఆశ్రయిస్తున్నారు.

ట్యాంకర్ రూ.1200 వరకు..

ప్రైవేట్ టాంకర్లకు మంచి డిమాండ్ ఉండటంతో కొండెక్కి రూ.వేలల్లో కూర్చుంటున్నారు. గతంలో మూడు వేల లీటర్ల ట్యాంకు నీరు రూ.600 నుంచి రూ.750కు లభించగా ప్రస్తుతం రూ.1200కు చేరుకుంది. చిట్టివలసకు చెందిన ఒక అపార్ట్‌మెంట్‌లో 8 కుటుంబాలు ప్రైవేట్ ట్యాంకర్ ద్వారా నీరు తెచ్చుకుంటే ఒక్క రోజులో ఖాళీ అయిపోయింది.

వర్షం నీరు డ్రైనేజీల పాలు

వాడుక నీటితో పాటు వర్షంనీటిని ఎవరూ రీసైక్లింగ్ చేయకపోవడంతో డ్రైనేజీల పాలవుతోంది. దీంతో వేసవిలో ప్రతిసారి నీటి సమస్య ఏర్పడుతోంది. ముఖ్యంగా ప్రతి వీధిలో అనధికారంగా నిర్వహిస్తున్న నీటి వ్యాపారం కారణంగా ఆ ప్రాంతంలో మిగిలిన బోర్లు ఎండిపోతున్నాయి. అనుమతులు లేకుండా నీటి వ్యాపారం నిర్వహిస్తున్నవారు ఎడాపెడా నీటిని తోడేసి వృథా చేస్తున్నారు. ఇలా నీటి వ్యాపారులు కూడా మిగిలిన నీటిని రీసైక్లింగ్ కాకుండా డ్రైనేజీలలో పారిస్తున్నారు. ఇలాంటి కారణాలే ప్రస్తుతం భీమిలి జోన్‌లో తాగునీటి సమస్యకు ప్రధాన కారణమని అపార్ట్‌మెంట్‌వాసులు గగ్గోలు పెడుతున్నారు.

కుళాయి కనెక్షన్లు.. ఇంకుడు గుంతలు లేక..

ఇక్కడి అపార్ట్‌మెంట్లలో చాలావరకు జీవీఎంసీ నుంచి కుళాయి కనెక్షన్లు లేవు. అలాగే చాలావరకు ఇంకుడు గుంతలు కూడా ఏర్పాటు చేసుకోలేదు. ఈ రెండు కారణాలతోనే అపార్ట్‌మెంట్లలో ముందుగా తాగునీటి కొరత ఏర్పడింది.